ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
5
మంగళవారం 2 జూలై 2024

నామకరణానికి కార్యాచరణ

ములుగు జిల్లాకు వనదేవతల పేరు!



ములుగు జిల్లా కేంద్రం

- 'సమ్మక్క, సారలమ్మ ములుగు జిల్లా'గా మార్పు
- రేపు ప్రత్యేక గ్రామసభలకు సన్నద్ధం
- గవర్నర్ పరిశీలనలో మునిసిపాలిటీ ఏర్పాటు
- మల్లంపల్లి మండలం ఆలస్యమయ్యే అవకాశం

ములుగు, జూలై 1: ములుగు జిల్లాకు మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మ పేరు పెట్టాలనే ప్రజల ఆకాంక్ష నెరవేరబోతోంది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల పునర్విభజన జరిగిన సమయంలో ఆయా జిల్లాలకు అక్కడి ప్రఖ్యాత ఆలయాలు, దేవుళ్ల పేరును పెట్టారు. 2019 ఫిబ్రవరి 17న ఏర్పడిన ములుగు జిల్లాకు సమ్మక్క, సారలమ్మ నామకరం చేయాలని జిల్లా సాధనసమితి, ప్రజాసంఘాలు, రాజకీయ పక్షాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేగా సీతక్క కూడా మంత్రులు, రాష్ట్ర ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అయితే.. ఈ అంశాన్ని అప్పటి ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. ఇప్పుడు సీతక్క రాష్ట్ర పంచాయరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖల మంత్రిగా కీలక పదవిలో ఉండటంతో ప్రజల విజ్ఞప్తిని కార్యాచరణలో పెట్టారు. సమ్మక్క, సారలమ్మ ములుగు జిల్లాగా పేరు మార్పు కోసం కలెక్టర్ దివాకరకు ప్రతిపాదించారు. ఈమేరకు జిల్లా పేరు మార్పు కోసం ప్రజాభిప్రాయం, అభ్యంతరాల స్వీకరణ కోసం పబ్లిక్ నోటీసును జారీ చేస్తున్నట్లు కలెక్టర్ దివాకర ఓ ప్రకటన విడుదల చేశారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక గ్రామ సభలను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. అభ్యంతరాలను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో లిఖితపూర్వకంగా తెలియజేయాలని పేర్కొన్నారు. ఇదే సమయంలో ములుగు మునిసిపాలిటీ, మల్లంపల్లి మండల ఏర్పాటుపై విడుదల చేసిన ప్రకటనలు చర్చనీయాంశంగా మారాయి.

మల్లంపల్లిపై ఊగిసలాట

ములుగు మండలంలోని మల్లంపల్లిని ప్రత్యేక మండలంగా ఏర్పాటుచేసే అంశంపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. 'కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా మల్లంపల్లి మండల ఏర్పాటు ఆలస్యమైవుతోంది' అని కలెక్టర్ టీఎస్.దివాకర ఓ ప్రకటనలో తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు సెప్టెంబరు 23న రాష్ట్ర ప్రభుత్వం మండల ఏర్పాటు కోసం 331/2023ద్వారా గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. ములుగు జిల్లా పరిధిలోని మల్లంపల్లి, రామచంద్రాపురం రెవెన్యూ గ్రామాలతోపాటు హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని కాట్రపల్లి రెవెన్యూ గ్రామాన్ని కలుపుతూ నూతన మండలాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు పూర్తయిన తర్వాత కూడా మండల ఏర్పాటుపై ఎటువంటి సానుకూల సంకేతాలు కనిపించకపోవడంతో సర్వత్రా సందేహాలు వ్యక్తమయ్యాయి. ఈనేపథ్యంలో కలెక్టర్ ప్రకటన చర్చనీయాంశమైంది. శాయంపేట మండలంలోని గ్రామాలు విలీనం కావడానికి అభ్యంతరం తెలపడంతో ఈ పరిస్థితి తలెత్తిందని కలెక్టర్ పేర్కొన్నారు.



మల్లంపల్లి గ్రామం


ములుగు గ్రామపంచాయతీ

ములుగు మునిసిపాలిటీపై ఉత్కంఠ

జిల్లా కేంద్రమైనప్పటికీ గ్రామపంచాయతీ హోదాలో ఉన్న ఉన్న ఏకైక ప్రాంతం ములుగు. మునిసిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం 2022 సెప్టెంబరు 12న అసెంబ్లీలో బిల్లును కూడా ప్రవేశపెట్టింది. ములుగు జీపీతో పాటు బండారుపల్లి, జీవంతరావుపల్లి పంచాయతీలను కలుపుతున్నట్లు అందులో పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగిసిన తర్వాత 2024 ఫిబ్రవరి 2న కొత్త మునిసిపాలిటీగా మనుగడలోకి వస్తుందని వెల్లడించారు. అయితే.. ఆచరణలో అమలు కాలేదు. 2025లో పురపాలక సంఘాల ఎన్నికలు జరిగే అవకాశముండగా ములుగుపై కొనసాగుతున్న ఉత్కంఠకు తాజాగా కలెక్టర్ విడుదల చేసిన ప్రకటన జత కూడింది. మునిసిపాలిటీ ఏర్పాటుకు సంబంధించిన ఫైలు గవర్నర్ పరిశీలనలో ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.

భరోసానిస్తున్న మంత్రి సీతక్క

ములుగు మునిసిపాలిటీ, మల్లంపల్లి మండలం, ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై రాష్ట్ర మంత్రి సీతక్క ప్రజలకు భరోసానిస్తున్నారు. వీటి సాధన కోసం జరిగిన ప్రజాపోరాటంలో సీతక్క భాగ స్వామిగా ఉన్నారు. ఇటీవల జరిగిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశాలు, మల్లంపల్లి, ఏటూరునాగారం లో పర్యటించిన సమయంలో ఈవిషయాన్ని స్పష్టం చేశారు. సాధించుకున్న కొత్త మండలం, రెవెన్యూ డివిజన్‌లను మనుగడలోకి తీసుకొస్తామని, ఈమేరకు కార్యాచరణ సిద్ధమవుతోందని పేర్కొన్నారు. దీంతో కొంత ఆలస్యమైనప్పటికీ అన్ని సాంకేతిక సమస్యలను అధిగమించి మునిసిపాలిటీ, మండలం, రెవెన్యూ డివిజన్‌లు ఏర్పాటవుతాయని ప్రజలు విశ్వసిస్తున్నారు.

అవస్థల మధ్య అంతంతమాత్రంగా!

- కనీస వసతుల్లేక అధ్వానంగా పారిశ్రామిక శిక్షణ సంస్థలు
- ఉమ్మడి జిల్లాలో ఆరు ఐటీఐ ప్రాంగణాలు
- పదేళ్లుగా రాని రా మెటీరియల్ డబ్బులు
- పాత యంత్రాలతోనే విద్యార్థుల కుస్తీ
- సిబ్బంది కొరతతో అరకొర శిక్షణ
- శిథిలావస్థలో భవనాలు, వర్క్‌షెడ్లు
- కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడం లేదని అభిప్రాయాలు


పూర్తిగా పాతబడి పోయిన వరంగల్ ఐటీఐ భవనం



అద్దె భవనంలో అరకొరవసతుల నడుమ నడుస్తున్న మహబూబాబాద్ ప్రభుత్వ ఐటీఐ

పాతబడిన భవనాలు.. ఎగిరిపోయి, కూలడానికి సిద్ధంగా ఉన్న రేకుల కప్పులు.. వాటిలో పాత కాలం నాటి యంత్రాలు.. కనిపించని కనీస వసతులు.. ఇవీ ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐలు)ల్లో కనిపిస్తున్న దుర్భర పరిస్థితులు. అయిదారు దశాబ్దాల క్రితం నిర్మించిన పాత భవనాలు కావడంతో అధ్వానంగా.. చూడడానికి డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. విద్యార్థులకు వివిధ వృత్తుల్లో సాంకేతిక శిక్షణనిచ్చి ఉపాధి కల్పించడానికి ఉద్దేశించిన ఉమ్మడిజిల్లాలో నిర్మించిన ఆరు ఐటీఐలు మారుతున్న కాలానికి అనుగుణంగా లేకపోవడం, నిధులు లేమి, ఫలితంగా రా మెటీరియల్ సరఫరా లేకపోవడం, టెక్నికల్ స్టాఫ్ సరిపడా లేకపోవడం పెద్ద సమస్యగా మారాయి. ఫలితంగా సరైన శిక్షణ పొందలేక.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధి, ఉద్యోగావకాశాలను అంది అందిపుచ్చుకోవడంలో విద్యార్థులు వెనుకబడుతున్నారన్న వాదన వినిపిస్తోంది. ప్రభుత్వం ఓ వైపు వృత్తి విద్యను ప్రోత్సహించాలని చెబుతూనే మరో వైపు అదే వృత్తి విద్యను నేర్పే ఐటీఐలను మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ పాలనలో పదేళ్ల ఎలాంటి నిధులు రాకపోవడంతో ఐటీఐ ప్రాంగణాల నిర్వహణ పూర్తిగా డీలా పడిపోయిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలైనా ఏ మాత్రం పట్టింపు లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి


శిథిలావస్థలో ఉన్న ఫిట్టర్, మెషినిస్టు తరగతి గదులు

వివరాలు 7వ పేజీలో..

ములుగు ఓఎస్డీగా గీతే మహేష్

ఏటూరుగారం ఏఎస్పీగా శివం ఉపాధ్యాయ


గీతే మహేష్ (ములుగు ఓఎస్డీ)


శివం ఉపాధ్యాయ (ఏటూరునాగారం ఏఎస్పీ)

ములుగు కలెక్టరేట్/ఏటూరునాగారం రూరల్, జూలై 1: ములుగు ఓఎస్డీగా గీతే మహేష్ బాబాసాహెబ్ నియమితులయ్యారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ఏటూరునాగారం ఏఎస్పీగా విధులు నిర్వర్తించారు. ములుగు ఓఎస్డీగా పదోన్నతి పొందారు. లాగే ఏటూ రునాగారం ఏఎస్పీగా శివం ఉపాధ్యాయ నియమితులయ్యారు. గ్రేహౌండ్స్ అసిస్టెంట్ కమాండర్‌గా ఆయన విధులు నిర్వర్తించారు. ఓఎస్డీగా మహేష్ బాబా సాహెబ్ ములుగుకు బదలీ కాగా ఆయన స్థానంలో శివం ఉపాధ్యాయ వచ్చారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి


పోస్టర్‌ను విడుదల చేస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

భూపాలపల్లిటౌన్, జూలై 1: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈనెల 7న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ వర్గీకరణ కోసం తమ సంఘం అధినేత వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద దీక్ష చేపట్టినట్లు తెలిపారు. మాదిగలు అధిక సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేణుకుంట్ల మహేష్, మేకల ఓంకార్, శీలపాక హరీష్, నరేష్, రాము, సుమన్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ ధర్నా


కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించిన ఏబీవీపీ విద్యార్థులు

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 1: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భూపాలపల్లి సమీకృత కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం ధర్నా నిర్వహించారు. డీఈవో కార్యాలయం ముట్టడికి వెళ్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంతో బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఏబీవీపీ నాయకుడు ప్రేమ్ మాట్లాడుతూ పేదలను ఫీజుల పేరుతో ప్రైవేటు పాఠశాలలు ఇబ్బందులు పెడుతున్నా పట్టించుకున్న నాథుడే లేడన్నారు. విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమైందని విమర్శించారు. ప్రభుత్వ హాస్టల్స్ మౌలిక సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరుచేసి హాస్టల్స్‌ల్లో మెరుగైన వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, సుశాంత్, రవితేజ, శశి, సన్నీ, రంజిత్, కారుణ్య, నరేష్, హరీశ్, రాజు, సంజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిని మెరుగు పరుస్తాం

జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్

కాకతీయఖని, జూలై 1: బొగ్గు ఉత్పత్తిని మెరుగుపర్చుకుంటామని సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ హబీబ్ హుస్సేన్ తెలిపారు. సింగరేణి కార్మికుల గైర్హాజరు, కాలం చెల్లిన ఎస్‌డీఎల్ యంత్రాలు, భూసేకరణ సమస్యలతో బొగ్గు ఉత్పత్తి అనుకున్న స్థాయిలో సాధించలేక పోయామని అన్నారు. స్థానిక జీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియాకు నూతన ఎస్‌డీఎల్ యంత్రాలు 17 వచ్చాయని, వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకుని అండర్‌గ్రౌండ్ గనుల్లో బొగ్గు ఉత్పత్తిని పెంచుతామని అన్నారు. జూలైలో ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్-2కు యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని వందశాతం పూర్తి చేస్తామన్నారు. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్-3కి భూసేకరణ సమస్యలతో అనుకున్న స్థాయిలో ఓవర్ బర్డెన్ తీయలేకపోయామని, దీంతో బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడిందని అన్నారు. భూసేకరణ సమస్యలను త్వరలోనే పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతామన్నారు. ఏరియాలో గైర్హాజరు శాతం ఎక్కువగా ఉందన్నారు. ప్రస్తుతం జీరో మస్టర్లు ఉన్న కార్మికులు సుమారు 70 మంది ఉన్నారని తెలిపారు. వారికి ఈనెల 5న కౌన్సెలింగ్ నిర్వహించి విధులకు హాజరులయ్యేలా చూస్తామన్నారు. పలు డిపార్ట్ మెంట్లలో కావాల్సిన ఉద్యోగుల కంటే ఎక్కువ ఉన్నారని హెచ్‌వోడీలు లేఖలు ఇవ్వడం వల్ల కొందరు ఉద్యోగులను అక్కడి నుంచి వేరేచోట బదిలీ చేస్తున్నామన్నారు. ఇందులో ఎలాంటి ఒత్తిడి లేదన్నారు.

పనులను అడ్డుకుంటే చర్యలు

ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్-3 కింద నగరంపల్లికి సంబంధించిన 508.30 ఎకరాల భూమిని సేకరించామని జీఎం తెలిపారు. దీనికి డిసెంబర్ 2021లో రూ.87,47,81,250 చెల్లించామన్నారు. సింగరేణి యాజమాన్యం తీసుకున్న భూమికి నిర్వాసితులకు పూర్తిగా డబ్బులు చెల్లించామని తెలిపారు. ఇటీవల కొందరు తమకు 1.36 ఎకరాలకు తక్కువ డబ్బులు వచ్చాయంటూ బొగ్గు ఉత్పత్తిని అడ్డుకున్నారన్నారు. అంతటితో ఆగకుండా సుమారు 10ఎకరాల వరకు సాగు చేస్తున్నారని అన్నారు. వారిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఎవరికైనా సమస్య ఉంటే కలెక్టర్‌ను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలి తప్ప పనులను అడ్డుకోవడం సరికాదని అన్నారు. అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

జూన్‌లో 65 శాతం ఉత్పత్తి

సింగరేణి భూపాలపల్లి ఏరియాకు యాజమాన్యం జూన్‌లో 3,48,700 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించిందని జీఎం తెలిపారు. కేటీకే-1 నుంచి 14,292 టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించామన్నారు. కేటీకే-5 నుంచి 15,630 టన్నుల బొగ్గును వెలికి తీశామన్నారు. కేటీకే-6వ గని ద్వారా 10,156 టన్నులు సాధించినట్లు తెలిపారు. కేటీకే-8వ గని ద్వారా 13,176 టన్నులు, ఓసీ-2 ద్వారా 95,241 టన్నులు, ఓసీ-3 ద్వారా 79,836 టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించామన్నారు. మొత్తంగా ఏరియా జూన్‌లో 2,28,331 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 65 శాతం లక్ష్యాన్ని సాధించామని వివరించారు.

రామప్ప సరస్సు నీటి విడుదల

ఆయకట్టు రైతుల్లో ఆనందం


సాగునీటిని విడుదల చేస్తున్న ఐబీ అధికారులు

వెంకటాపూర్(రామప్ప), జూలై 1: మండలంలోని పాలంపేట గ్రామంలో రామప్ప సరస్సు సాగునీటిని సోమవారం ఐబీ డీఈ రవీందర్‌రెడ్డి, ఏఈ శ్రీకాంత్ రెండు తూముల ద్వారా విడుదల చేశారు. సరస్సు ఆయకట్టు కింద 5,108 ఎకరాలకు నీటి విడుదలతో ఉపయోగం ఉంటుందని అన్నారు. ఒగరుకాల్వ కింద 3100 ఎకరాలు, కొత్తకాల్వ కింద 380, బూర్గుకాల్వ కింద 400ఎకరాలు, పులితూము సోమికాల్వ కింద 1100 ఎకరాలు, కొత్తకాల్వ కింద 200 ఎకరాలకు ప్రయోజనం చేకూరనుందని వివరించారు. రామప్ప సరస్సు నీటి విడుదలతో రైతుల్లో హర్షం వ్యక్తమైంది. ఈ కార్యక్రమంలో ఐబీ అధికారి డి.రాజేందర్‌రెడ్డి, ఏఈ నారాయణస్వామి, రైతులు బండి శ్రీను, ప్రభురెడ్డి, గోపాల్, భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూలై 1: రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని రవాణా శాఖ ఇన్‌చార్జి అధికారి సమ్మానీ అన్నారు. జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలతో ఆయన సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ ప్రతీ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ప్రజావాణిలో వినతుల వెల్లువ


ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 1: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ రాహుల్ శర్మ వాటిని స్వీకరించారు. ప్రజలు బారులుతీరి సమర్పించారు. మొత్తం 72 వినతులు రాగా కలెక్టర్ వాటిని పరిశీలించారు. కాటారం, మహదేవపూర్ మండలాల్లో ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థుల కోసం ఎస్ఎంహెచ్ హాస్టల్స్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా రాజ్‌కుమార్ ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కాటారం, మహదేవపూర్ మండల కేంద్రాల్లో ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు వసతిలేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఎస్ఎంహెచ్ హాస్టల్స్‌ను ఏర్పాటుచేయాలని కోరారు. మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో కబ్జాకు గురైన సర్వే నెం 197,198 లోని బొక్కలగుంట భూమిని వెంటనే రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆ గ్రామానికి చెందిన రాజశేఖర్ కోరారు. ప్రభుత్వం ఐదేళ్ల క్రితం కొత్త గ్రామ పంచాయతీగా ఆవిర్భవించిన చిట్యాల మండలం కొత్తపేట గ్రామంలో రేషన్‌షాపును ఏర్పాటుచేయాలని గ్రామస్థులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సుమారు వెయ్యి మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో రేషన్‌షాపు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మంజూరు చేయాలని కోరారు. క్వింటాలుకు ఐదు కిలోల తరుగు తీసి రైతులు పొట్టకొట్టారని, వెంటనే తమకు న్యాయం చేయాలని కొయ్యూరు రైతులు డీసీఎంఎస్ నిర్వాహకుడు రమేష్‌రెడ్డిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వినతులు స్వీకరించిన ఆయన ఆయా సమస్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రాధాన్యక్రమంలో వాటిని పరిష్కరించి బధితులకు న్యాయం చేకూరేలా చర్యలు చపట్టాలన్నారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ప్రజావాణిలో వచ్చిన జిల్లాకు సంబంధించిన వినతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





సందడిగా కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

జిల్లా వ్యాప్తంగా 240 బాలబాలికల హాజరు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 1 : వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్‌ఎస్)లో వరంగల్ జిల్లా స్థాయి బాలబాలికల (కిడ్స్) అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. సోమవారం జేఎన్‌ఎస్ లోని సింథటిక్‌ట్రాక్‌పై అండర్ 8, 10, 12 బాలబాలికల విభాగాల్లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి (కిడ్స్) అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరై లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ ఎంపికలో వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ మండల కేంద్రాల నుంచి 240 బాలబాలికలు పాల్గొనడం జరిగిందన్నారు.

ఇక్కడ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన 15 మంది బాల బాలికల ను ఈ నెల 7న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలోని గోపీచంద్ అకాడమిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కిడ్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, సైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్, కోచ్‌లు శ్రీమన్నారాయణ, నాగరాజు, పీఈటీలు కృష్ణమూర్తి, మహేందర్, శ్రీలత, శ్రీనాథ్, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి

చిందు కళాకారులకు ఇందిరమ్మ ఇళ్లు

గడ్డం సమ్మయ్యకు అభినందన సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

దేవరుప్పుల, జూలై 1: అర్హులైన చిందు కళాకారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం మండలంలోని అప్పిరెడ్డిపల్లెకు చెందిన చిందు కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యకు స్వగ్రామంలో అభినందన సభ జరుగగా శ్రీహరితో పాటు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ సమ్మయ్య తాతల కాలం నుంచి చిందు వృత్తితోనే జీవనం సాగించేవారని, సమ్మయ్య కూడా అదే వృత్తిని కొనసాగిస్తూ కళలను పదిమందికి ఉపయేగపడే విధంగా కృషి చేశారని అన్నారు. ఆయన కృషికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి పద్మశ్రీ ఇచ్చారని గుర్తు చేశారు.

చిందు కళాకారులతో పాటు మాదిగ ఉపకులాలకు ప్రభుత్వం ఆదుకునేలా కృషి చేస్తానన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ సమ్మయ్య పద్మశ్రీ అవార్డు పొందడం పాలకుర్తికే గర్వకారణమన్నారు. సమ్మయ్య కుటుంబంతో పాటు చిందు కళాకారులను అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకునే విధంగా తాను కృషి చేస్తానన్నారు. ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ చాకలి అయిలమ్మ, దొడ్డి కొమురయ్య రజాకార్లకు ఎదురొడ్డి పోరాడిన గడ్డలో సమ్మయ్య జన్మించడం, చిందు కళలకు ఆజ్యం పోయడం, పద్మశ్రీ అవార్డు పొందడం చాలా ఆనందంగా ఉందన్నారు. మామిడి హరికృష్ణ మాట్లాడుతూ సమ్మయ్య పద్మశ్రీ పొందడం తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమన్నారు. ప్రభుత్వం తరుపున సమ్మయ్యతో పాటు చిందు కళాకారులను ప్రభుత్వం ఆదుకునే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా వారు సమ్మయ్యను పూలమాలలు, షాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గడ్డం మోహన్‌రావు, వంశీధర్‌రెడ్డి, శివకుమార్, రాంబాబు, నల్ల శ్రీరామ్, పులిగిళ్ల సుధాకర్, కందగట్ల సత్తయ్య, గడ్డం వెంకన్న, ఒగ్గు రవి, అందె భాస్కర్, రాజ్‌కుమార్‌నాయక్, గుర్రం సీతారామ్, లక్ష్మీనారాయణ నాయక్, మాచర్ల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



సమ్మయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి

సీపీఆర్‌పై పోస్టల్ కవర్ విడుదల

డాక్టర్ రామక శ్రీనివాస్ కృషితో రూపకల్పన



డాక్టర్ శ్రీనివాస్‌తో కలిసి పోస్టల్ కవర్‌ను విడుదల చేస్తున్న పోస్టుమాస్టర్ జనరల్ శ్రీలత

హనుమకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్స్ డే సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని చారిత్రాత్మకమైన పోస్టాఫీసులో సీపీఆర్ ప్రక్రియ పోస్టల్ కవర్‌ను హైదరాబాద్ జోన్ పోస్టు మాస్టర్ జనరల్ శ్రీలత విడుదల చేశారు. అకస్మాత్తుగా గుండె పోటు వచ్చిన అత్యవసర సమయంలో చేయాల్సిన ప్రథమ చికిత్స కార్డియో పల్మనరీ పునరుజ్జీవనం (సీపీఆర్)పై గత రెండు దశాబ్దాలుగా కృషి చేస్తున్న హనుమకొండకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ రామక శ్రీనివాస్ తపాలశాఖ సహకారంతో ఈ పోస్టల్ కవర్‌ను తయారు చేయించారు. సీపీఆర్‌పై తగిన ప్రచారం, ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ పోస్టల్ కవర్‌ను తపాలా శాఖ విడుదల చేసింది. ఈ సందర్భంగా పోస్టు మాస్టర్ జనరల్ శ్రీలత మాట్లాడుతూ డాక్టర్ శ్రీనివాస్ చాలా కాలంగా సీపీఆర్ పట్ల అవగాహన కల్పించేందుకు చేస్తున్న కృషిని కొనియాడారు. మానవ హక్కుల వేదిక నాయకుడు ఎస్ జీవన్ కుమార్ డాక్టర్ శ్రీనివాస్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ఆయన పొందిన పురస్కారాలను, సేవాభావాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్‌తో పాటు సీనియర్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎ సుబ్రమణ్యం, పోస్టల్ యూనియన్ నాయుడు సీహెచ్ ప్రతాపరెడ్డి, సీనియర్ మెడికల్ రిప్రజెంటేటివ్, మెడికల్ కౌన్సిలర్ పి భరత్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ (రిటర్డ్) వి. రామచంద్రారెడ్డి ఇతర పోస్టాను సిబ్బంది పాల్గొన్నారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో నలుగురి డీబార్

కేయూ క్యాంపస్, జూలై 1 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య డిగ్రీ కోర్సుల పరీక్షల్లో చూచి రాతలకు పాల్పడగా పరీక్షల తనిఖీ అధికారులు పట్టుకుని నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్. నరేందర్‌లు సోమవారం తెలిపారు. డీబారైన వారిలో సికింద్రాబాద్ యూనివర్సిటీ పీజీ కళాశాల ఓయూలో ఇద్దరూ, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మరో ఇద్దరూ ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే పరీక్షల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జాతీయ స్థాయి ప్రేరణ శిక్షణకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



అక్షయ్‌రామ్ వర్ష

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1 : జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రేరణ శిక్షణకు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు డీఈవో డాక్టర్ ఎండి. అబ్దుల్ హై సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 4 నుంచి 10వ తేదీ వరకు గుజరాత్‌లోని వాదన నగర్‌లో నిర్వహిస్తున్న అఖిల భారత ప్రేరణ శిక్షణకు పంథిని జడ్పీహెచ్‌ఎస్‌లో పదవ తరగతి చదువుతున్న కర్ణకంటి అక్షయ్‌రామ్, కాజీపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న గండి వర్ష ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్

ఏటూరునాగారం రూరల్, జూలై1: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ కార్యక్రమం జరిగింది. వివిధ సమస్యలతో వచ్చిన గిరిజనుల వద్ద నుంచి పీవో చిత్రా మిశ్రా వినతులు స్వీకరించారు. మొత్తం 66 మంది గిరిజనుల తమ సమస్యల ను పీవోకు విన్నవించారు. గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో సీట్ కేటాయించాలని కన్నాయిగూడెం మండలం చింతగూడెం గ్రామానికి చెందిన చింత రుషి వినతి పత్రం అందించారు. సీఆర్‌టీగా ఉద్యోగావకాశం కల్పించాలని మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన తుమ్మి భాగ్య కోరారు. అనారోగ్యా కారణాల వల్ల ఇబ్బందులు పడుతున్నామని, ఐటీడీఏ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని వెంకటాపురం మండలానికి చెందిన వర్షిణి విజ్ఞప్తి చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏఎన్‌ఎంగా ఉద్యోగావకాశం కల్పించాలని తాడ్వాయికి చెందిన దుగ్గిరాల శ్రీలేఖ వినతి పత్రం అందించారు. సర్వే నంబర్ 141, 142లోని భూమికి పట్టాలివ్వాలని ఏటూరునాగారం మండలం రొయ్యూర్ గ్రామానికి చెందిన తాటి నీలాద్రి కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, డీడీ పోచం, ఏవో దామోదర స్వామి, ఎస్.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్‌పీడీసీఎల్ ఇన్‌-చార్జ్ డైరెక్టర్‌గా మధుసూదన్ బాధ్యతల స్వీకరణ



మధుసూదన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

హనుమకొండ టౌన్, జూలై 1 : ఎన్పీడీసీఎల్ ఇంచార్జి డైరెక్టర్ (ఆపరేషన్)గా మధుసూదన్ సోమవారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇంత కాలం ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించిన వి. మోహన్‌రావు జూన్ 30 న పదవి విరమణ పొందడంతో హెచ్‌ఆర్‌డి సీజీయంగా విధులు నిర్వర్తిస్తున్న టి. మధుసూదన్‌ను ఇన్‌చార్జి డైరెక్టర్ (ఆపరేషన్)గా నియమిస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, సోమవారం బాధ్యతలు స్వీకరించిన మధుసూదన్‌ను ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పలు రైళ్లు దారిమళ్లింపు

కాజీపేట, జూలై 1 - బల్లార్షా సెక్షన్‌లో మూడో లైన్‌ల నిర్మాణపనుల కారణంగా ఈ నెల 3 నుంచి పలు రైళ్లను దారి మళ్లించి నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ న్యూఢిల్లీ మధ్య నడిచే తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నిజామాబాద్, బల్లార్షా మీదుగా దారి మళ్లించి నడుపుతున్నారు. గోరఖ్‌పూర్ - యశ్వంతాపూర్‌ల మధ్య నడిచే యశ్వంతాపూర్ ఎక్స్‌ప్రెస్ మక్తల్, నిజామాబాద్‌ల మీదుగా, దారి మళ్లించినడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.





అవస్థల మధ్య అంతంతమాత్రంగా!


వరంగల్ ఐటీఐలో అధ్వానంగా విద్యార్థుల టాయిలెట్లు

కనీస వసతుల్లేక అధ్వానంగా పారిశ్రామిక శిక్షణ సంస్థలు

- పదేళ్లుగా రాని రా మెటీరియల్ డబ్బులు
- పాత యంత్రాలతోనే విద్యార్థుల కుస్తీ
- సిబ్బంది కొరతతో అరకొర శిక్షణ
- శిథిలావస్థలో భవనాలు, వర్క్‌షెడ్లు

హనుమకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు ఆరే ఉన్నాయి. వరంగల్, హనుమకొండ, కాజీపేటల్లో మూడు, మహబూబాబాద్, భూపాలపల్లి, ఏటూరునాగారంలో మరో మూడు నడుస్తున్నాయి. జనగామ జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ లేదు. ఏటూరునా గరం ఐటీఐ ప్రధానంగా స్థానికంగా ఉన్న ఎస్టీలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసింది. ఈ ఐటీఐల్లో ప్రవేశాల్లో ఎస్టీలకు 80 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు ఐటీఐలు 21 వరకు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలపై మొత్తం అజమాయిషీ ఢిల్లీలోని డైరెక్టర్ జనరల్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రేనింగ్ (డేట్) అనే సంస్థదే. ఐటీఐల్లో ఇచ్చే పారిశ్రామిక శిక్షణకు సంబంధించిన సిలబస్‌ను ఈ సంస్థే తయారు చేస్తుంది. ఈ సంస్థ రూపొందించిన ట్రెయినింగ్ మ్యాన్యువల్‌నే వీటిలో అమలు చేస్తారు. కాగా ప్రభుత్వ ఐటీఐల్లో పని చేసే ఉద్యోగులకు మాత్రం వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. శిక్షణకు అవసరమైన మౌలిక సదుపాయాలను, సామగ్రిని సమకూర్చాల్సింది కూడా రాష్ట్ర ప్రభుత్వమే. ప్రభుత్వ ఐటీఐల్లో పది రకాల ట్రేడ్‌లలో శిక్షణ ఇస్తుండగా ప్రైవేటు ఐటీలు మాత్రం కేవలం ఒకటీ, రెండు ట్రేడ్‌లనే నిర్వహిస్తున్నాయి. వాటిలో ఎలక్ట్రిషియన్ తప్పని సరి. ఈ ఐటీలలో ఒక సంవత్సరం కోర్సు, రెండు సంవత్సరాల కోర్సులున్నాయి. ఎలక్ట్రిషియన్ రెండు సంవత్సరాల కోర్సు. కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (కోపా) ఏడాది కోర్సు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీల్లో ప్రవేశాలన్నీ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతాయి. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే రిజర్వేషన్ ప్రకారం సీట్ల కేటాయింపు జరుగుతుంది.

అందని రా మెటీరియల్ డబ్బులు.. పాతయంత్రాలతోనే కుస్తీ..

ఐటీఐల్లో చదువుకునే విద్యార్థులకు ఆయా ట్రేడ్‌లలో పొందుతున్న శిక్షణకు గాను రా మెటీరియల్‌పైనే ప్రతీ నెల రూ.400 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేయాలి. ఒక సంవత్సరం కోర్సు చదివే విద్యార్థికైతే సంవత్సరానికి రూ.4800, రెండు సంవత్సరాల కోర్సు విద్యార్థికి రూ.9600 ఖర్చు చేయాలి. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలి. కానీ పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇప్పటి వరకు ఇవ్వలేదు. కేవలం ఐటీఐల్లో పని చేసే ఉద్యోగులకు జీతాలు మాత్రమే వస్తున్నాయి. చాలా ఐటీఐల్లో పాత యంత్రాలే ఉన్నాయి. బడ్జెట్ లేకపోవడంతో కొత్త యంత్రాలను కొనే పరిస్థితి లేదు. ఈ పాత యంత్రాలతోనే విద్యార్థులు కుస్తీ పడుతున్నారు. వీటిపైనే ప్రయోగాలు చేస్తున్నారు. రా మెటీరియల్ రాకపోవడం వల్ల విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయడంలో ఇబ్బందులు పడుతున్నారు. పాత మెటీరియల్స్‌తోనే మళ్లీమళ్లీ చేయాల్సి వస్తోంది. ఉదాహరణకు ఒక ఫిట్టర్ విద్యార్థి ఇనుము మెటీరియల్ సరఫరా లేక గత విద్యార్థులు చేసిన ఇనుప ముక్కలతోనే మళ్లీ చేస్తున్నారు. అలాగే ఎలక్ట్రీషియన్ విద్యార్థి విద్యుత్ వైర్ల సరఫరా లేక పాత వైర్లతోనే సర్దుకోవలసి వస్తోంది. వెల్డింగ్ ట్రేడ్ విద్యార్థులు ఏడాదిలో 50 ప్రాక్టికల్స్ చేయాల్సి ఉంటుంది. మెటీరియల్ లేక పది, పదిహేను ప్రాక్టికల్స్‌తోనే సరిపెట్టుకోవలసి వస్తోంది. ఐటీఐల నిర్వహణ ఖర్చులను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదు. సరిగా బడ్జెట్ రాకపోవడం వల్ల ప్రతీ నెల విద్యుత్ బిల్లులను చెల్లించడం కూడా ఐటీఐలకు కష్టంగా మారింది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ప్రభుత్వ ఐటీఐల్లో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. గత పదేళ్ల కాలంలో అనేక మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. వారి స్థానంలో ఇప్పటి వరకు కొత్త నియామకాలు జరగేలేదు. కేవలం 40శాతం సిబ్బందితోనే ఐటీఐలు నడుస్తున్నాయి.


వరంగల్ ఐటీఐలో డ్రాఫ్ట్స్‌మెన్ తరగతుల భవనం దుస్థితిదీ..

ఇటీవల వీఆర్‌వోలు, వీఆర్‌వోలను జూనియర్ అసిస్టెంట్లుగా ఐటీఐలలో నియమించినా పెద్దగా ప్రయోజనం లేకుం డా పోయింది. వారికి వృత్తి శిక్షణకు సంబంధించిన కనీస పరిజ్ఞానం కూడా లేదు. గ్రామాల్లో మస్కూరు పని చేసే వీరికి సాంకేతికపరమైన వృత్తిశిక్షణపైగానీ, కనీసం ఆఫీసులో రికార్డుల నిర్వహణలోగానీ అవగా హన లేకపోవడం వల్ల వారు ఉన్నా ప్రయోజనం లేని పరిస్థితి ఉంది. ఒక్కో ఐటీఐకి ఇద్దరు, ముగ్గురిని నియ మించడంతో ఐటీఐల్లో సిబ్బంది ఉన్నట్టుపైకి కనిపిస్తు న్నది కానీ క్షేత్ర స్థాయిలో అంతాలోటే. ఇక ఐటీఐల్లో వృత్తిశిక్షణలో కీలకమైన టెక్నికల్ స్టాఫ్ మరీ తక్కువ గా ఉన్నారు. అన్ని ఐటీఐలలో 60 శాతానికిపైగా ఖాళీ లున్నాయి. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం లోకి రాకముందు ఎప్పుడో పన్నేండేళ్ల క్రితం ఏపీపీ ఎస్సీ ద్వారా జరిగిన నియామకాలే తప్ప ఆ తర్వాత కాలంలో ఖాళీల భర్తీయే జరగలేదు. టీఎస్‌పీఎస్సీ ద్వారా ఇప్పటి వరకు ఎలాంటి నియామకాలు జరగ లేదు. ఇటీవలే కొంత మంది కాంట్రాక్టు ఉద్యోగులను మాత్రం రెగ్యులరైజ్ చేశారు. ఇదొక్కటే ఐటీఐలో జరిగిన చెప్పుకోదగిన పరిణామం. ఐటీఐలో ఒక్కో యూనిట్ (ట్రేడ్)లో 20 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. అలా ఎన్ని ట్రేడ్‌లు ఉంటే 20 మంది చొప్పున అంత మంది విద్యార్థులను తీసుకుంటారు. నిబంధనల ప్రకారం ఒక్కో ట్రేడ్‌కు ఒక ఇన్‌స్ట్రక్టర్ తప్పని సరిగా ఉండాలి. కానీ ఇన్‌స్ట్రక్టర్ల కొరత వల్ల ఉన్న వాళ్లే ఒక్కొక్కరు రెండు, మూడు ట్రేడ్లను చూసుకోవాల్సి వస్తోంది.

కానరాని కనీస సౌకర్యాలు

ప్రభుత్వ ఐటీఐల్లో కనీస సౌకర్యాలు భూతద్దం వేసి చూసినా కానరావు. ఐటీఐలకు ప్రస్తుతం ఉన్న భవనాలు 70, 80 ఏళ్లనాటివి. అవి పూర్తిగా పాతపడి శిథిలావస్థకు చేరుకున్నాయి. ములుగు రోడ్డులోని ఐటీఐలోని భవనాలు, వర్క్‌షెడ్లు పూర్తిగా పాతపడిపోయి కనిపిస్తాయి. మూత్ర, శాలలు, మరుగుదొడ్లు కూడా సరిగా లేవు. తాగునీటి సదుపాయం అసలు లేదు. అరకొర వసతుల మధ్య వృత్తిశిక్షణ పొందుతున్న విద్యార్థులు నిత్యం ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోంది. మహబూబాబాద్ ఐటీఐ భవనం పూర్తిగా పాతపడడంతో దాని స్థానం కొత్త భవనం నిర్మించగా జిల్లా పోలీసు అధికారులు లాక్కొని అందులో ఎస్పీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. చేసేది లేక ఐటీఐను అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. భూపాలపల్లిలో ఐటీఐ కోసం కట్టిన కొత్త భవనంలో తొలుత కలెక్టరేట్ ఏర్పాటు చేయగా కలెక్టరేట్ భవనం పూర్తికావడంతో ఇటీవలే దానిని ఐటీఐకి తిరిగి అప్పగించారు.

జనగామలో ఎప్పుడు?

ఉమ్మడి వరంగల్‌లోని అయిదు జిల్లాల్లో ప్రభుత్వ ఐటీఐలు ఉండగా జనగామ జిల్లాలో మాత్రం ఇప్పటి వరకు ఏర్పాటు కాలేదు. ఈ జిల్లాకు ప్రభుత్వ ఐటీఐ ఇది వరకే మంజూరైంది. ఐటీఐ భవన నిర్మాణానికి సిద్ధిపేట రోడ్డులోని గుట్టల సమీపంలో స్థలాన్ని కూడా కేటాయించారు. సర్వే కూడా పూర్తయింది. ఆ తర్వాత ప్రభుత్వం పట్టించుకోకపోవడం, స్థానిక ప్రజాప్రతి నిధులు ఒత్తిడి తీసుకురాకపోవడంతో జనగామలో ఐటీఐ ఏర్పాటు ఎక్కడవేసిన గొంగలి అక్కడే చందంగా మారింది. దీనితో విద్యార్థులు ప్రైవేటు ఐటీఐలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే అవకాశంగా తీసుకొని ప్రైవేటు ఐటీఐలు విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో వేలాది రూపాయాలను గుంజుతున్నాయి.

ఒకే క్యాంపస్‌లో..

ములుగు రోడ్డులోని వరంగల్ ఐటీఐ క్యాంపస్ విశాలంగా ఉంటుంది. 70 ఏళ్ల క్రితం ఈ ఐటీఐ ఏర్పాటైంది. దీనికి విశిష్టమైన చారిత్రక నేపథ్యం ఉన్నది. ఈ ఐటీఐకి విశాలమైన స్థలం ఉండటంతో.. ఇదే అవకాశంగా అన్ని కార్యాలయాలను ఇందులోనే ఏర్పాటు చేశారు. హనుమకొండ ఐటీఐని కూడా ఇందులోకే మార్చారు. ఇది వరకు ఇది వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సమీపంలో అద్దె భవనంలో నడిచేది. దానిని ఈ ములుగు రోడ్డులోని ఐటీఐ క్యాంపస్‌కు తరలించారు. ఐటీఐల రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం కూడా ఇందులోనే ఉంది. ఇది చాలదన్నట్టు వరంగల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసును, దీంతో పాటు రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసును సైతం ఇందులోనే చోటిచ్చారు. పట్టించుకునేవారు లేకపోవడంతో ములుగు రోడ్డులోని ఐటీఐ స్థలంలో కొంత భాగం అన్యాక్రాంతమైంది. విచిత్రమేమిటంటే ప్రస్తుతం పాత సెంట్రల్ జైలు స్థలంలో నిర్మాణంలో ఉన్న మల్టీసూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి బహుళ అంతస్తుల భవన స్థలంలో కొంత ఇందులోనే చూపారు.

ఏటీసీలు సరే.. ఐటీఐల్లోని సమస్యల సంగతేంటి?

ప్రభుత్వ ఐటీఐలు అనేక సమస్యల మధ్య కొట్టుమిట్టాడుతున్న నేపథ్యంలో టాటా టెక్నాలజీ లిమిటెడ్ (టీటీఎల్) సహకారంలో వీటిల్లో అడ్వాన్సుడ్ ట్రెయినింగ్ సెంటర్ (ఏటీసీ)లను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఏటీసీలు ఐటీఐలో ఒక భాగంగానే నడుస్తాయి కానీ ప్రస్తుతం ఉన్న పాత ఐటీఐ పరిస్థితేంటన్నది ప్రశ్న. ఏటీసీలు మాత్రమే టీటీఎల్ ఆధ్వర్యంలో నడుస్తాయి. ఐటీఐలు మాత్రం యథావిధిగా ప్రభుత్వ యాజమాన్యంలోనే కొనసాగుతాయి. ఏటీసీలు ఏర్పాటయితే ప్రస్తుతం ఐటీఐల్లో నిర్వహిస్తున్న ట్రేడ్ల సంగతేమిటన్న ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది. ప్రస్తుతం ప్రభుత్వ ఐటీఐల్లో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, వెల్డర్, డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, టర్నర్, మెషినిస్టు, కోపా ట్రేడ్లను నిర్వహిస్తున్నారు. వీటి కొనసాగింపు విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. ఐటీఐ ఆవరణలో ఏటీసీల నిర్వహణకు కొత్త భవనాల నిర్మాణం జరుగుతుంది. కానీ ఐటీఐ ప్రస్తుత పాత భవనాల సంగతేమిటీ? విద్యార్థులకు రామెటీరియల్ డబ్బులు ఇచ్చేది ఎవరు? సిబ్బంది ఖాళీల భర్తీ జరిగేనా? మౌలిక వసతుల కల్పన మాటేమిటీ? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఏటీసీల ఏర్పాటుతో పాటు సమాంతరంగా ఐటీఐలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే ఏటీసీల ఏర్పాటుతో ఒరిగే ప్రయోజనం పెద్దగా ఏమీ ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రైతన్నకు మద్దతుగా..


వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు పెంచిన కేంద్రం


ఘన్‌పూర్ మార్కెట్‌కు రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 1: రైతులు పండిస్తున్న పంటలకు మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచింది. పెరిగిన ధరలు ఈ సీజన్ నుంచే అమలులోకి వచ్చాయని చెబుతున్నారు. ఏ పంట ధర ఎంత పెరిగింది? మార్కెట్ యార్డులో ఏ సరుకుకు ట్రేడర్లు ఎంత ధర ఇస్తున్నారు? అనేది ఈ ధరలతో రైతులు పోల్చుకుంటే నష్టపోకుండా ఉండవచ్చు. ఒక్కోసారి కొన్ని పంటలకు మద్దతు ధరల కంటే డిమాండ్‌ను బట్టి ఎక్కువ ధర కూడా లభించే అవకాశం ఉంటుంది. మద్దతు ధరలపై రైతులకు అవగాహన ఉంటే లాభపడే అవకాశం ఉంటుంది. ఐతే గత ఏడాది ధరలతో ఈ ఏడాది పెంచిన ధరలను.. పెరిగి పోతున్న పెట్టుబడి వ్యయంతో పోల్చి చూసుకుంటే పెద్దగా ఒరిగిందేమీ లేదని రైతులు పెదవి విరుస్తున్నారు. ఎంతైనా గుడ్డిలో మెల్లలా కొంత మేలు జరుగుతుందని ఆశిస్తున్నారు. దుక్కులు దున్నడం, విత్తనాలు వేయడం, ఎరువులు, పురుగు మందులు, కూలీ రేట్లు, కలుపు తీయడం, పంట కోత కోయించడం, తూర్పార పట్టించడం, మార్కెట్ యార్డుకు రవాణా చేయడం అన్నీ లెక్కలు వేసి చూసుకుంటే చివరకు ఏం మిగలడం లేదని వాపోతున్నారు. ఆరుగాలం కష్టించిన రైతుకు లాభం మాటేమోగాని కూలీ గిట్టుబాటు కాని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడికి, చేసిన అప్పులకు పోగా రోజుకు వంద, రెండు వందలు కూడా రైతుకు కూలి పడడం లేదని వాపోతున్నారు.

పంట పెట్టుబడి ఇలా..

ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులు వాటిని పండించడానికి పెడుతున్న పెట్టుబడి, వస్తున్న ఆదాయం లెక్క వేసి చూస్తే పెద్దగా ఫలితం ఉండడం లేదని తెలుస్తోంది. సన్న, చిన్న కారు రైతులకు వస్తున్న ఆదాయం ఏ మాత్రం చెప్పుకోదగినదిగా ఉండడం లేదంటున్నారు. వరి పంటకు ఎకరాకు పెట్టుబడి 20 నుంచి 25 వేల రూపాయల వరకు అవుతోందని, ట్రాక్టర్‌తో దున్నడానికి రూ.5 వేలు, విత్తనాలు వేయడానికి రూ.5 వేలు, కలుపు తీయడానికి రూ.3 వేలు, ఎరువులు, పురుగు మందులకు 3 వేలు, కోత కోయడానికి రూ.5 వేలు, రవాణ తదితర ఖర్చులు కలుపుకుని తడిసి మోపెడు అవుతోందని రైతులు వాపోతున్నారు. కాగా ఎకరాకు 30 నుంచి 40 బస్తాల ధాన్యం లేదా 20 నుంచి 22 క్వింటాళ్లు మాత్రమే వస్తోందని, ధాన్యం ధర క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ. 2300 వేసుకున్నా 46 వేల నుంచి 50 వేల రూపాయలు వస్తున్నాయి. పెట్టుబడి పోను ఆరు నెలలు కష్టపడితే రూ. 20 వేల నుంచి 25 వేలు మాత్రమే మిగులుతన్నాయని చెబుతున్నారు. అంటే నెలకు రూ.3 వేల నుంచి 4 వేలు మాత్రమే మిగిలినట్టు. ఇంత తక్కువ మిగిలితే రోజు కూలి ఏం పడినట్టని ప్రశ్నిస్తున్నారు. ఉపాధి హామీ కూలికి వెళితే రోజుకు రూ.200ల నుంచి రూ.300లు కూలి వస్తున్నదని చెబుతున్నారు.



పెరిగింది గోరంతే...

తోట రమేశ్, రైతు, శివునిపల్లి

నాలుగేళ్ల క్రితం మద్దతు ధరలు కొంత మెరుగ్గానే పెరిగాయి. ప్రస్తుతం పంట పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఈసారి పెరుగుదల అంతంతే ఉంది. ఏ మాత్రం గిట్టుబాటు కాదు. చేసిన కష్టం, పెట్టుబడి, నిర్వహణ ఖర్చులు అన్ని చూసుకుంటే లాభం మాటేమోగాని రైతులే మిగిలేలా ఉంది.

పెరిగిన మద్దతు ధరల వివరాలు

వరి సాధారణ రకం క్వింటాల్‌కు గత ఏడాది రూ. 2183 కాగా ఈ ఏడాది రూ.2300కి పెరిగింది. అంటే క్వింటాల్‌కు రూ. 117 పెరుగుదల ఉంది.

పంట	2024	2023	పెరుగుదల
వరి (సాధారణ)	2300	2183	117
వరి (ఏ గ్రేడ్)	2320	2203	117
పెసలు	8682	8558	124
మినుములు	7400	7050	450
మొక్కజొన్న	2225	2090	135
కందులు	7550	7000	550
వేరుశనగ	6783	6377	406
పత్తి(పొట్టిపింజ)	7121	6620	501
పత్తి(పొడుగుపింజ)	7521	7020	501
పొద్దు తిరుగుడు	7280	6760	520
సోయాబీన్(పసుపు)	4892	4600	292
నువ్వులు	9267	8635	632
జొన్నలు(హైబ్రీడ్)	3371	3180	191
జొన్నలు(మల్దండి)	3421	3225	196
సజ్జలు	2625	2500	125
రాగులు	290	3846	444

వరికి కనీసం రూ.500లు పెంచాలి



సముద్రాల రాజు, రైతు, నమిలిగొండ

ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.500లు, పత్తికి రూ.1000లు పెంచితే రైతులకు కొంత లాభదాయకం. అలా కాకుండా ధాన్యానికి రూ.117, పత్తికి రూ. 501లు పెంచడం ప్రస్తుత పెట్టుబడికి ఏమాత్రం సరిపోదు. రైతుకు కనీసం కూలి రేటు కూడా పడకపోతే ఇక ఏం ఫలితం ఉంటుంది?

ఎద్దు పొడిచి గిరిజన రైతు మృతి


మృతి చెందిన రైతు బానోత్ శ్రీను

మహబూబాబాద్ రూరల్, జూలై 1 : ఎద్దు పొడవడంతో గిరిజన రైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలం ఇస్లావత్‌తండా (ఎస్) శివారు బిచ్యాతండాలో అదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బిచ్యాతండాకు చెందిన బానోత్ శ్రీను (47) రెండు ఎద్దు ఉన్నాయి. వర్షం వస్తుండడంతో ఆరు బయట ఉన్న పశువులను కొట్టంలో కట్టేసేందుకు వాటిని తీసుకువెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎద్దు ఒక్కసారిగా శ్రీనును పొడవడంతో అతని తల ఇంటిగోడకు బలంగా తాకింది. దీంతో శ్రీను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నానుకి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య నానుకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అన్నారం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న పరీక్షలు

మహదేవపూర్, జూలై 1: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం (సరస్వతీ) బ్యారేజీ వద్ద నిపుణుల బృందం చేపడుతున్న పరీక్షలు 11 రోజులక చేరాయి. ప్యారర్ సెర్చింగ్ మెథడ్‌లో ఈ టెస్టులు జరుగుతున్నాయి. మొత్తం 42 ప్రాంతాల్లో ఈ టెస్టులు చేయాల్సి ఉండగా సోమవారం నాటికి ఏడు ప్రాంతాల్లో వీటిని నిర్వహించారు.

ఎస్సీ గురుకులాల్లో పార్ట్‌టైం లెక్చరర్లు, టీచర్లకు దరఖాస్తు ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1 : హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల, కళాశాలల్లో పార్ట్‌టైం టీచర్లు, లెక్చరర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆర్‌సీవో ఎస్. విద్యారాణి తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్ ఫిజిక్స్ కెమిస్ట్రీ, జువాలజీ, ఎకనామిక్స్ సోషల్, బయోసైన్స్, హిందీ, పీఈటీ పోస్టులు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీతో పాటు బీఈడీ చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. జూలై 3వ తేదీ లోపు హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌజ్ ఎదురుగా ఉన్న ఆర్‌సీవో కార్యాలయంలో అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 4వ తేదీన ఇంటర్వ్యూతో పాటు డెమో ఉంటుందని తెలిపారు.

ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షల రీ షెడ్యూల్

కేయూ క్యాంపస్, జూలై 1 : జూలై 2, 4 తేదీల్లో జరగాల్సిన కాకతీయ యూనివర్సిటీ ఎంబీఏ నాల్గవ సెమిస్టర్ పరీక్షలను డివిజన్ కౌంట్స్ ఆఫీసర్స్ పరీక్షల కారణంగా రీషెడ్యూల్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికా రెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 2న జరుగాల్సిన పరీక్ష జూలై 20న, జూలై 4న జరుగాల్సిన పరీక్ష జూలై 22న జరుగుతుందని స్పష్టం చేశారు. పరీక్షల సమయం, పరీక్ష కేంద్రాల్లో ఏలాంటి మార్పులు ఉండవని పేర్కొన్నారు.

6 నుంచి ఎంసీఏ నాలుగో సెమిస్టర్ ఎగ్జామ్స్

కేయూ క్యాంపస్, జూలై 1 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ సీబీసీఎస్ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు జూలై 6 నుంచి జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 6, 9, 11 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. రెగ్యులర్, ఎక్స్ ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని కోరారు. కేయూ క్యాంపస్‌లోని కామర్స్ విభాగం, ఎడ్యుకేషన్ విభాగం, హనుమకొండ వాగ్దేవి పీజీ కళాశాల, సుబేదారిలోని యూనివర్సిటీ మహిళ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఒకే ఈతలో ఏడు మేకల పిల్లలు


ఏడు పిల్లలకు జన్మనిచ్చిన మేక

మరిపెడ రూరల్, జూలై 1 : సహజంగా మేకలు, గొర్రెలు ఒకే ఈతలో 1, 2, లేదంటే మూడు పిల్లలు జన్మించడం సాధారణంగా చూస్తాం.. కానీ ఈ మేక గతంలో 3 పిల్లలకు జన్మనివ్వగా ఈ సారి ఏకంగా ఏడు పిల్లలకు జన్మనిచ్చింది. ఈ అరుదైన ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామంలో చోటు చేసుకుంది. రైతు రేఖ వెంకన్నకు చెందిన మేక ఏడు పిల్లలకు జన్మనిచ్చింది. జన్మించిన ప్రతి పిల్ల ఆరోగ్యంగా ఉండడంతో రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. ఇందులో నాలుగు పోతు పిల్లలు, మూడు కొదమలు ఉన్నట్లు రైతు తెలిపారు.

టెక్స్‌టైల్ పార్కును సందర్శించిన 'యంగ్‌వన్' చైర్మన్



హెలిప్యాడ్ వద్ద టీజీఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్‌తో మాట్లాడుతున్న చైర్మన్ కిహాక్‌సంగ్

గీసుగొండ, జూలై 1: గీసుగొండ మండలం శాయంపేటహవేలి గ్రామశివారులోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)ను దక్షిణకొరియా దేశానికి చెందిన యంగ్‌వన్ కంపెనీ చైర్మన్, సీఈవో కిహాక్‌సంగ్, కంపెనీ ప్రెసిడెంట్ మిన్‌సుక్‌లీ, డైరెక్టర్ ఎండీ షాజాహాన్ సోమవారం సందర్శించారు. సోమవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డితో హైదరాబాద్‌లో అపాయింట్‌మెంట్ ఉన్న నేపథ్యంలో వారు తొలుత టెక్స్‌టైల్ పార్కుకు చేరుకుని తమ కంపెనీ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించేందుక వచ్చారని టీజీఐఐసీ అధికారులు తెలిపారు. హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో పార్కుకు వచ్చిన కంపెనీ ప్రతినిధులు స్థలం మ్యాప్‌ను పరిశీలించడంతో పాటు 3 గంటల పాటు వారు కంపెనీ నిర్మాణాలపై చర్చించారు. యంగ్‌వన్ కంపెనీకి పార్కులో వస్త్ర పరిశ్రమలను నెలకొల్పేందుకు 297 ఎకరాలను టీజీఐఐసీ కేటాయించగా రూ.980 కోట్ల అంచనా వ్యయంతో కొద్దినెలల క్రితం కంపెనీ నిర్మాణ పనులను చేపట్టింది. ఇందులో 12వేల మందికి ప్రత్యక్షంగా, మరో 10వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉందని టీజీఐఐసీ అధికారులు చెబుతున్నారు. వస్త్ర పరిశ్రమల రంగంలో యంగ్‌వన్ కంపెనీకి ప్రపంచంలోనే మంచి గుర్తింపు ఉందని, ఫామ్ టూ ఫ్యాషన్ ఫారిన్ అనే విధంగా ఇందులో వస్త్రాలు తయారు చేస్తారని అధికారులు పేర్కొన్నారు. యంగ్‌వన్ కంపెనీ ప్రతినిధుల వెంట టీజీఐఐసీ జోనల్ మేనేజర్ రామా సంతోష్‌కుమార్, తదితరులున్నారు.

బాల్యంపై.. బ్యాగు భారం!



వర్ధన్నపేట రూరల్, జూలై 1 : పుస్తకాల బరువు బాల్యాన్ని కుంగదీస్తోంది. కిలోలకు కిలోల బరువుంటున్న పుస్తకాల బ్యాగులతో చిన్నారుల వెన్నెముక వంగిపోతోంది. ప్రైవేటు పాఠశాలల పుణ్యమా.. అని ఒకటి, రెండు తరగతుల విద్యార్థులే 20 నుంచి 25కిలోల పుస్తకాలను మోస్తున్నారు. వాస్తవానికి విద్యార్థి బరువులో 10 శాతం మాత్రమే పుస్తకాల బరువు ఉండాలని చెబుతున్న విద్యాహక్కు చట్టం.. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు అసలు పుస్తకాలు ఉండొద్దని పేర్కొంటోంది. కానీ, ఈ నిబంధనలేవీ అమలవడం లేదు. అవసరం లేని పుస్తకాలను పాఠశాలలలోనే భద్రపరుచుకునేలా లాకర్ల సదుపాయం ఏర్పాటు చేయాలని ఉన్నా చాలా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. మరోవైపు మారిన ఫ్యాషన్ పోకడలతో ప్రస్తుతం విద్యార్థులు నడుం కిందకు బ్యాగు వేలాడేలా వేసుకుంటున్నారు. దీని వల్ల మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అవసరం లేని పుస్తకాలే ఎక్కువ..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరు సబ్జెక్టులకు సంబంధించిన ఆరు పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉంటాయి. కానీ, ప్రైవేట్ పాఠశాలల్లో మాత్రం అందుకు విరుద్ధంగా తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని మోపేందుకు ఒకటి, రెండు తరగతులు చదివే విద్యార్థులకు 10 నుంచి 12 పుస్తకాలు, ఒక్కో సబ్జెక్టుకు తరగతి వర్క్‌బుక్, హోం వర్క్, ప్రాజెక్టు పని ఇలా మూడేసి పుస్తకాలు కొనుక్కోవాలని చెబుతున్నారు. పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ మొత్తం 30 నుంచి 45 అవుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అవసరం లేని పుస్తకాలను పక్కకు పెట్టి అవసరం ఉన్న వాటిని వాడుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు.

వరంగల్ జిల్లాలో 244 ప్రైవేటు పాఠశాలలు ఉండగా 70,520 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే చాలా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ లాభాపేక్ష కోసం పలు పబ్లికేషన్స్ రూపొందించిన, తమ సంస్థల పేరిట ముద్రించిన పుస్తకాలను కొనాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తున్నాయి. ఈ క్రమంలో ఎల్‌కేజీ చదువుకునే విద్యార్థికి 6 నుంచి 10 పాఠ్య పుస్తకాలు, క్లాస్ వర్క్, హోమ్‌వర్క్ కోసమంటూ పదుల సంఖ్యలో నోట్ పుస్తకాలు ఇస్తున్నాయి. తల్లిదండ్రులు వాటిని బ్యాగుల్లో ఉంచి పిల్లలను బడికి పంపుతున్నారు. వీటికి లంచ్ బాక్స్, వాటర్ బాటిల్ తోడవడంతో బ్యాగు బరువు 4 నుంచి 6 కిలోల వరకు అవుతోంది. ఇలా తరగతి పెరిగే కొద్దీ బరువు పెరుగుతోంది. ఈ మోత భారంతో పిల్లలు చిన్నతనం నుంచే అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

- పుస్తకాల మోతతో విద్యార్థుల అవస్థలు
- ఏటేటా పెరుగుతున్న బరువు
- చిన్న వయస్సులోనే వెన్నెముక సమస్యలు
- అమలు కాని విద్యాహక్కు చట్టం నిబంధనలు
- అవగాహన కల్పించని అధికారులు

ఈసారైనా అవగాహన కల్పించేనా..?

విద్యాహక్కు చట్టంపై క్షేత్రస్థాయిలో అధికా రులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగా ణ ప్రభుత్వం అదే స్థాయిలో విద్యాహక్కు చట్టం ప్రైవేటు పాఠశాలల్లో అమలవుతుందా.. లేదా చూసుకోవడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రు లు ప్రైవేటు యాజమాన్యాలను ప్రశ్నించేలా చట్టంపై అవగాహన తేవా లి. ఆయా మండలాల్లోని ఎంఈవోలతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు కళాజాత మాదిరిగా, ప్రభుత్వ పాఠశాలల పనితీరు ను వివరించేటప్పుడు, విద్యా హక్కుపై గల సామాన్య ప్రజల హక్కును గుర్తుచేయాల్సి బాధ్యత ఎంతైనా ఉంది.

అధిక భారం వెన్నుపూస పైనే..

నిటారుగా నిలబడాలంటే వెన్నుపూస ప్రధాన ఆధారం. పుస్తకాల బ్యాగును వీపుపై వేసుకోవడం వల్ల వెన్నెముకపై భారం పడుతోంది. దీంతో అది దెబ్బతినే ప్రమాదం ఉంది. 15ఏళ్ల పిల్లల శరీరంలో వివిధ రకాల మార్పులు సంభవిస్తాయి. ఈ వయస్సులో వెన్నెముకపై సామర్థ్యానికి మించి భారం వేయడం వల్ల అనేక సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరి స్తున్నారు. వెన్నుముక, మెడ నొప్పులు వచ్చే ప్రమాదం ఉంద ని చెబుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు.

అమలుకు నోచుకోని చట్టాలు..

ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పాఠ్యపుస్తకాల బరువు తగ్గించా లని ప్రభుత్వం 2006లోనే చట్టాన్ని తీసుకొచ్చింది. కానీ, అది అమలుకు నోచుకోవ డం లేదు. విద్యార్థి శరీర బరువులో 10 శాతం మాత్రమే పాఠ్యపుస్తకాలు ఉండేలా ఆ చట్టం చెబుతోంది. విద్యార్థి సుమారు 14కిలోలు ఉన్నాడనుకుంటే ఆవిద్యార్థి తీసుకెళ్లే బ్యాగు మాత్రం 4 కిలోలు ఉంటుంది. దాన్ని మోసేందుకు విద్యార్థి అష్టక ష్టాలు పడాల్సిన పరిస్థితి. ప్రైవేటు పాఠశాలలు నాలుగైదు అంతస్థుల్లో ఇరుకిరుకు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. దాంతో విద్యార్థులు పుస్తకాల బ్యాగులతో అన్ని అంతస్థులు ఎక్కాల్సిందే.

వెన్నుముకపై భారం పడుతుంది



డాక్టర్ సోమశేఖర్, ఎండీ సర్జన్

చిన్న వయసులోనే విద్యార్థులు అధిక పుస్తకాలు గల బ్యాగులు మోయడంతో బరువు నేరుగా వెన్నెముకపై పడుతుంది. ఎంతో సున్నితమైన ప్రదేశంలో మనకు తెలియకుండా రోజు రోజుకు భారం పెరగడంతో ఒక్కసారిగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. బోధన విధానం, చదువుకునే తీరు కూడా సమయాన్ని బట్టి అనుసరించాలి. ఆడుకునే సమయంలో ఆడుకోకుండా చదవడమే చేస్తే మానసికంగా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతారు.

పిల్లలపై ఒత్తిడి తగ్గించాలి



గాండ్ల కుమార్, వర్ధన్నపేట

పిల్లలపై పుస్తకాల బరువుతో పాటు మానసికంగా కూడా పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయి. చిన్న వయసులో ప్రశాంతంగా ఉండాల్సిన విద్యార్థులు పేజీల కొద్ది పుస్తకాలు తిరగేస్తూ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. ప్రభుత్వం విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయడంలో విఫలమైంది. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రైవేటు పాఠశాలలపై ఎల్లప్పుడు నిఘా పెంచితే వారి ఆగడాలను అరికట్టవచ్చు.

విద్యుత్ అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం



విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జూలై 1: విద్యుత్ శాఖ అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్ అధికారులతో సోమవారం రాత్రి ఆయన సమావేశమై పలు అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోవు వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈదురు గాలులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాలు విరిగిపడే అవకాశం ఉంటుందన్నారు. చెట్లు విరిగిపడి విద్యుత్‌కు అంతరాయం కలిగే ప్రమాదాలు పొంచి ఉంటాయని అన్నారు. కాగా అలాంటి వాటిని వెంటనే గుర్తించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ఇటీవల చిట్యాల మండలం బావుసింగ్‌పల్లిలో కర్రె ఓదెలు అనే రైతుకు చెందిన ఎద్దు పంటపొలంలో విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందిందని అన్నారు. ఈ ఘటనకు విద్యుత్‌శాఖ అధికారులదే బాధ్యత అని మండిపడ్డారు. మరోసారి అలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బందితో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ వారు దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ మల్హార్ నాయక్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

రైతుల సూచనలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

రేగొండ: రైతు భరోసా పథకం అమలుపై రైతులు ఇచ్చిన సూచనలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు అధ్యక్షతన రైతు భరోసా అమలుపై ప్రత్యేక సభ జరిగింది. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. నిజమైన రైతులకు ఆర్థిక సహాయం అందాలనేది ముఖ్యమంత్రి ఆలోచన అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, సాగుకు యోగ్యం కాని గుట్టలు, కుంటలు ఉన్న వందల ఎకరాల భూ స్వాములకు రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయొద్దని సూచనలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పున్నం లక్ష్మి, జడ్పీటీసీ సాయిని విజయ, తహసీల్దార్ సత్యనారాయణస్వామి, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, నాయకులు నర్సయ్య, కిష్టయ్య, ఉమేష్‌గౌడ్, శంకరయ్య, గండి తిరుపతిగౌడ్, ఏనుగు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గణపురం : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని చెల్పూరు ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్ గండ్ర సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మహాజన సభకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ రైతు భరోసా, రుణమాఫీ జరుగుతుందన్నారు. రియల్ ఎస్టేట్ భూములు, పట్టా కలిగిన గుట్టలు, చెరువులు వంటి వాటికి రైతు బంధు ఇవ్వొద్దని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సాగు చేసుకునే రైతులతో పాటు, కౌలు రైతులకు సహాయం చేసి రైతుబీమాను అందించాలన్నారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కావటి రవి, మల్హల్‌రావు, వెంకన్న, సంపత్‌రావు, తిరుపతి, రవి తదితరులు పాల్గొన్నారు

విద్యాభివృద్ధికి కృషి చేద్దాం : డీఈవో రాజేందర్

భూపాలపల్లిటౌన్, జూలై 1: విద్యాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని డీఈవో రాజేందర్ ఉపాధ్యాయులకు, సిబ్బందికి సూచించారు. భూపాలపల్లి జిల్లాలో విద్యాశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రాజేందర్‌కు డీఈవోగా ఇన్‌చార్జి బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ క్రమంలో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో భూపాలపల్లి జిల్లాను అగ్రభాగాన నిలుపుతానని అన్నారు. ఇందుకు ఉపాధ్యాయులు సహరించాలని కోరారు. బాధ్యతలు స్వీకరించిన డీఈవో రాజేందర్‌ను కార్యాలయ సూపరింటెండెంట్ మాచర్ల శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ సురేష్, శ్రీకాంత్, జూనియర్ అసిస్టెంట్ గౌసుద్దీన్, సిబ్బంది శ్రీకాంత్, శశికళ, రమేష్, లక్ష్మణ్, శైలజ, రామకృష్ణ, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు సహాయ కార్యదర్శి శనిగరపు భద్రయ్య, మల్లికార్జున్, మహేందర్‌రెడ్డి సన్మానించారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిరసన

కాకతీయఖని, జూలై 1: బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ తెలంగాన బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వ ర్యంలో భూపాలపల్లి ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య మాట్లాడుతూ శ్రావణపల్లి, కల్యాణ్ ఖని, కోయగూడెం, సత్తుపల్లి బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీలకు, గనుల మేనేజర్లకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సదానందం, గౌరీపతిశర్మ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లకు శిక్షణ

కాకతీయఖని, జూలై 1: సింగరేణిలో పనిచేస్తున్న మైనింగ్, ఎలక్ట్రికల్, మెకానిక్ వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లకు ఓరియెంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాంను సోమవారం నిర్వహించారు. భూపాలపల్లి ఏరియా జీవీటీసీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం వెంకట్రామిరెడ్డి హాజరై వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ల స్టాటుటరీ డ్యూటీస్, అవేర్నెస్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో 24 మంది వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, సింగరేణి అధికారులు జీఎల్ ప్రసాద్, తుకారాం, రామన్ వి.పాఠక్, మనోజ్‌కుమార్, మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో వనమహోత్సవం

కాటారం, జూలై 1: మండల కేంద్రంలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో సోమవారం వనమహోత్సవాన్ని నిర్వహించారు. కాటారం గ్రామపంచాయతీ సహకారంతో విద్యుత్‌శాఖ అధికారులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీ జాడి మహేశ్వరి, ట్రాన్స్‌కో కాటారం ఏడీఈ నాగరాజు, సబ్ ఇంజనీర్ ఉపేందర్ తదితరులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాటారం పంచాయతీ కార్యదర్శి సఫీర్‌ఖాన్, ఈజీఎస్ ఏపీవో వెంకన్న, టీఏ మనోజ్, ఎఫ్ఏ రాజమణి, నాయకులు జాడి రమేష్, మనోహర్‌నాయక్, కుమార్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోకు వినతి

వెంకటాపురం(నూగూరు), జూలై 1: మండలంలోని కొమురంభీం ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని కోరుతూ గోండ్వాన సంక్షేమపరిషత్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ఏటూరునాగారంలో ఐటీడీఏ పీవో చిత్రమిశ్రాకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ కొమురంభీం గ్రామానికి చెందిన ఆదివాసీలు కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నారని అన్నారు. వీటికి హక్కుపత్రాలు అందజేసి ఆదివాసీలను ఆదుకోవాలని కోరారు.

'రాజధాని' బస్సు సర్వీసు ప్రారంభం

ఏటూరునాగారం, జూలై 1 : ఏటూరునాగారం నుంచి హైదరా బాద్‌కు రాజధాని (ఏసీ) బస్ సర్వీసును ఆర్టీసీ వరంగల్-2 డిపో మేనేజర్ జి. సురేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై ఎస్‌కె.తాజుద్దీన్ పాల్గొన్నారు. ఈ బస్సు సర్వీసు ప్రతి రోజూ ఉదయం 11 గంటలకు ఏటూరునాగారం నుంచి ఉప్పల్ వరకు, సాయంత్రం 5 గంటలకు ఏటూరునాగారం నుంచి హనుమకొండకు నడపనున్నట్లు ఆర్టీసీ కంట్రోలర్ శంకర్ తెలిపారు. ఏటూరునాగారం నుంచి హైదరాబాద్‌కు రూ. 620, హనుమకొండకు రూ. 280 చార్జీలు ఉంటాయన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూలై 1: ఉరేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి పట్టణంలో సోమవారం చోటుచే సుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కారల్‌మార్క్స్‌కాలనీకి చెందిన గుంటి సమ్మక్క (48)కు కొన్నేళ్ల కిందట వివాహమై విడాకులయ్యాయి. అప్పటి నుంచి తన సోదరుడు గుంటి పోచయ్య ఇంట్లో నివాసముంటోంది. ఒంటరి జీవితంతో మానసిక వేదనకు గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు పోచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్త చట్టం భారతీయ న్యాయ సురక్ష సంహిత ప్రకారం కేసు నమోదు చేసినట్టు నరేష్‌కుమార్ తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

చిట్యాల, జూలై 1: మండలంలోని ముచినిపర్తి గ్రామానికి చెందిన గీత కార్మికుడు మూల తిరుపతి తాటిచెట్టు పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు తడుక సుధాకర్ డిమాండ్ చేశారు.

పీహెచ్‌సీలో హెచ్‌డీఎస్ కమిటీ సమావేశం

కాటారం, జూలై 1: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌డీఎస్ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఎంపీపీ పంతకాని సమ్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఆస్పత్రి అభివృద్ధి కోసం చేయాల్సిన చర్యలపై చర్చించి తీర్మానించారు. గతంలో ఉన్న వైద్యాధికారి దుర్వినియోగం చేసిన రూ.7లక్షల నిధులు ప్రస్తుతం నెలకు రూ.37 వేల చొప్పున అతడి నుంచి రికవరీ అవుతున్నాయని యూడీసీ సుధాకర్ తెలిపారు. రికవరీ నిధులు, వచ్చిన నిధులతో ఆస్పత్రి అభివృద్ధికి చేయాల్సిన పనులు, కొనుగోలు చేయాల్సిన వస్తువులు, ఆస్పత్రి ఆవరణలో క్లీన్‌అండ్ గ్రీన్ చేయడం, బయో మెడికల్ పిట్స్ నిర్మాణం చేయడం వంటి అంశాలపై తీర్మానాలు చేశారు. వైద్యాధికారి డాక్టర్ మౌనిక, ఎంపీడీవో అడ్డూరి బాబు, ఎంపీవో ఉపేంద్రయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు పర్వీనాబేగం, సీహెచ్‌వో నిర్మల, యూడీసీ సుధాకర్, స్టాఫ్‌నర్స్ కృప తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులపై దృష్టి పెట్టాలి

ములుగు కలెక్టర్ దివాకర



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూలై 1: వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్.దివాకర సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ములుగు కలెక్టరేట్‌లోని సమావే శపు హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం జరగ్గా ఆయన ప్రజల నుంచి 63 వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి వినతులను అధిక ప్రాధాన్యతతో వెంటవెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, సీహెచ్.మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీడబ్ల్యూవో స్వర్ణలత లెనిన, ఎల్‌డీఎం రాజ్‌కుమార్, సీపీవో ప్రకాష్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి బంద్‌ను విజయవంతం చేయండి

మావోయిస్టు కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

కాకతీయఖని, జూలై 1: సింగరేణి బొగ్గు బ్లాకులను వేలానికి పెట్టొద్దని, సత్తుపల్లి, కోయగూడెం, కేకే-6, శ్రావణపల్లి గనులను సింగరేణి కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న చేపట్టనున్న సింగరేణి బంద్‌ను విజయవంతం చేయాలని మావోయిస్టు పార్టీ కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధంకావాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు నిరసనలకు, బంద్‌కు సభ్య సంఘాలను, విప్లవకర ట్రేడ్ యూనియన్లు, క్రాఫ్ట్ సంఘాలను సంప్రదిం చకుండా, ఐక్య కూటమి ఉద్యమాల ఆలోచన లేకుండా ఏకప క్షంగా పోరాట షెడ్యూల్ ప్రకటించారని పేర్కొన్నారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏఐటీయూసీ యూనియన్ నిర్ణయం చారిత్రాత్మక తప్పిదమని ఆక్షేపించారు. కార్మిక సంఘాల అనైక్యత, పెట్టుబడి దారులకు కొమ్ముకాసే తత్వం నల్ల చట్టాలతో ప్రజలు జీవించే హక్కులు హరించుకుపోతున్నాయని ఆరోపించారు.

అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించొద్దు

గోవిందరావుపేట, జూలై 1: గొత్తికోయగూడాల్లోకి వచ్చే అసాంఘికశక్తులకు ఆశ్రయం కల్పించొద్దని పస్రా ఎస్సై కమలాకర్ సూచించారు. సోమవారం ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి మచ్చాపూర్ గొత్తికోయగూడాన్ని సందర్శించారు. గొత్తికోయలను సమావేశపరిచి పలు సూచనలు చేశారు.

పదెకరాలలోపు రైతు భరోసా ఇవ్వాలి

ములుగు, జూలై 1: పదెకరాలలోపు వ్యవసాయ భూమి ఉన్న వారికి రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ములుగు, ఇంచర్ల పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో అధికారులు సోమవారం అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పలువురు రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. పీఏసీఎస్ చైర్మన్లు సత్తిరెడ్డి, రాములు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయచంద్ర, జిల్లా సహకార అధికారి సర్దార్‌సింగ్, ఏవో సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే

ములుగు కలెక్టరేట్, జూలై 1: ములుగులోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశపుహాల్‌లో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య హాజరై కేక్ కట్ చేశారు. వైద్యవృత్తి చాలా ఉన్నతమైనదని, రోగులను సరైనవిధానాలతో నిర్ధారించడానికి, చికిత్స చేయడానికి సమగ్రజ్ఞానం కలిగి ఉండాలన్నారు. వైద్యులు తమ జ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలని, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం వైద్యులు డీఎంహెచ్‌వో అప్పయ్యను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వైద్యులు పోరిక రవీందర్, గౌతమ్, రంజిత్, శ్రీలత, విజయ్, గిరి, లోకప్రియ, నవీన్, డెమో తిరుపతయ్య, సూపరింటెండెంట్ విజయభాస్కర్, గణేష్, సీహెచ్‌వోలు దుర్గారావు, సంపత్‌రావు, సిబ్బంది సాంబయ్య, సంపత్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

- కాటారం: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డాక్టర్ల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనికతో పాటు ఇతర డాక్టర్లను ఎంపీపీ పంతకాని సమ్మయ్యతో సహా పలువురు శాలువాలతో సన్మానించారు.

- చిట్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో జాతీయ వైద్య దినోత్సవం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎంపీటీసీ కట్కూరి పద్మనరేందర్ ఆధ్వర్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ జీడి తిరుపతి, డాక్టర్ శ్రీకాంత్, విద్య, అఖిలను ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ కట్కూరి నరేందర్, స్టాఫ్‌నర్సు విజయకుమారి, ఫార్మసిస్టు నళిని, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- వాజేడు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డాక్టర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారులు మధుకర్, మహేందర్, లోహితలను వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాలు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ అన్ని వృత్తులలో కంటే వైద్య వృత్తి ఎంతో గొప్పదని అలాంటి వృత్తిలో కొనసాగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు సేవ చేయటానికి వైద్య వృత్తిని ఎంచుకున్నట్లు వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సూర్యప్రకాశరావు, హెచ్ఎస్ కోటిరెడ్డి, వెంకటరమణ, హెచ్ఏలు శ్రీనివాసరావు, చిన్నవెంకటేశ్వర్లు, శేఖర్, ఏఎన్‌ఎంలు నాగేంద్రకుమారి, లలితకుమారి, కన్యాకుమారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు జవాబుదారీగా ఉండాలి : ఎస్పీ ఖరే



ప్రజా దివస్‌లో ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూలై 1: పోలీసులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మొత్తం 19 ఫిర్యాదులు రాగా వాటిని ఎస్పీ స్వీకరించారు. వాటిపై వివిధ స్టేషన్ల పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

ఆపరేషన్ స్మైల్ పోస్టర్ ఆవిష్కరణ

ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమ పోస్టర్‌ను ఎస్పీ కిరణ్ ఖరే తన చాంబర్‌లో ఆవిష్కరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. చిన్న పిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. బాల కార్మికులు ఎవరికైనా కనిపిస్తే 1098 లేదా 100 నంబరుకు సమా చారం అందించాలని సూచించారు. డీఎస్పీ నారాయణనాయక్, సీడీబ్ల్యూసీ చైర్మన్ దామోదర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో కొమురయ్య, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వినోద, ఇన్‌స్పెక్టర్లు రవీందర్, రమేష్‌తోపాటు ముస్కాన్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ములుగు లయన్స్‌క్లబ్‌కు అవార్డులు



అవార్డు అందుకుంటున్న ములుగు లయన్స్‌క్లబ్ సభ్యులు

ములుగు కలెక్టరేట్, జూలై 1: ములుగు లయన్స్‌క్లబ్ మూడు అవార్డులను సొంతం చేసుకుంది. ఆదివారం వరంగల్‌లోని బిర్లా ఇంటర్నేషనల్ ఓపెన్‌మైండ్ స్కూల్ ఆవరణలో 320ఎఫ్ జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన అవార్డునైట్స్ కార్యక్రమంలో కమిటెడ్ ప్రెసిడెంట్ అవార్డు డాక్టర్ పూజారి రఘు, సెకండ్ బెస్ట్ సెక్రటరీ అవార్డు చుంచు రమేష్, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకుగాను ములుగు లయన్స్‌క్లబ్‌కు బెస్ట్ క్లబ్ అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా మల్టిపుల్ చైర్‌పర్సన్ రాజిరెడ్డి మాట్లాడుతూ ములుగు లయన్స్‌క్లబ్ ఏజెన్సీ ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలు, హెల్త్ క్యాంపులు, హంగర్ రిలీఫ్‌లపై అవగాహన సదస్సులు నిర్వహించడం పట్ల అవార్డులు అందించడం జరిగిందని అన్నారు. ఇకముందు కూడా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి అవసరార్థులను ఆదుకోవాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ కుందూరు వెంకటరెడ్డి, వన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సుధాకర్‌రెడ్డి, పీడీజీలు, రీజన్, జోన్ చైర్‌పర్సన్‌లు, 90క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, ములుగు లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వచ్చిన వాహనం..



హైదరాబాద్ నుంచి భూపాలపల్లికి తిరిగి వచ్చిన వాహనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 1: భూపాలపల్లి పాత కలెక్టర్ భవేష్ మిశ్రా తన వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటున్న బొలెరో వాహనం తిరిగి వచ్చింది. 'సారు.. అదే తీరు' శీర్షికన జూన్ 29న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై తీవ్ర చర్చ జరగ్గా.. ఎట్టకేలకు భవేష్ మిశ్రా వాడుకుంటున్న వాహనం తిరిగి భూపాలపల్లి కలెక్టరేట్‌కు చేరుకుంది. జిల్లాకు చెందిన ఇద్దరు ఉద్యోగుల సేవలను కూడా భవేష్ మిశ్రా వినియోగించుకుంటున్నారనే విషయాన్ని సైతం అదే కథనం ద్వారా 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. ఈ క్రమంలో ఆ ఉద్యోగులు కూడా భూపాలపల్లికి చేరుకున్నారు.

కిరాణా షాపులో చోరీ

మహదేవపూర్, జూలై 1: కిరాణా షాపులో ఓ వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. దుకాణ యజమాని కళ్లుగప్పి రూ. 20 వేలు అపహరించాడు. ఈ సంఘటన మండలంలోని కాళేశ్వరంలో సోమవారం జరిగింది. గ్రామంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న గండెసిరి మధుసూదన్ కిరాణ షాపును నిర్వహిస్తున్నాడు. దుకాణంలో ఆయన ఉండగా ఓ అజ్ఞాత వ్యక్తి వచ్చాడు. మధుసూదన్ లోపలికి వెళ్లగా గల్ల పెట్టెలోంచి నగదును దొంగలించాడు. సీసీ కెమెరాలో ఇది నిక్షిప్తం కాగా గమనించిన మధుసూదన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఉద్విగ్నంగా మండల సర్వసభ్య సమావేశం

ములుగు, జూలై 1: ఐదేళ్ల ప్రజాప్రతినిధులుగా చెలామణి అయి ములుగు మండల అభివృద్ధిలో భాగస్వాములైన ఎంపీటీసీలంతా ఉద్వేగానికి గురయ్యారు. సోమవారం ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి అధ్యక్షతన చివరి సర్వసభ్య సమావేశం జరగ్గా హాజరైన వారంతా తమ అనుభవాలను, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎన్నుకున్న ప్రజలకు, పదవీ కాలంలో సహకరించిన అధికారులు, ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులను శాలు వాలతో సన్మానించారు. సమావే శంలో ఎంపీడీవో రామకృష్ణ, ఆయా శాఖల అధికారులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో గ్రావిటీ కాల్వలో ఒకరి మృతి

మహదేవపూర్, జూలై 1: మండలంలోని లక్ష్మీపంప్ హౌజ్ నుంచి సరస్వతీ బ్యారేజీకి నీటిని తరలించే గ్రావిటీ కాల్వలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కాళేశ్వరం ఇన్‌చార్జి ఎస్సై చక్రపాణి తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం చింతలపల్లికి చెందిన నైనం శేఖర్ (28)కు అన్నారం పంచాయతీ పరిధిలోని దుబ్బపల్లికి చెందిన స్నేహతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆదివారం అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు భార్యతో అత్తగారింటికి వచ్చిన శేఖర్ ఆదివారం రాత్రి మద్యం సేవించి భార్యతో గొడవ పడ్డాడు. అనంతరం ఇంటి నుంచి వెళ్లాడు. కుటుంబ సభ్యులు వెతకగా గ్రావిటీ కాల్వలో అతడు శవమై కనిపించాడు. మృతురాలి భార్య స్నేహ ఫిర్యాదు మేరకు కాళేశ్వరం ఎస్సై చక్రపాణి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 1: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులనుకలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. వైద్యఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, డీఆర్డీవో, మహిళా శిశు సంక్షేమశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. నీరు నిలిచే ప్రాంతాల్లో యాంటీ లార్వా స్ప్రే చేయడంతోపాటు ఆయిల్‌బాల్స్, గంబూషియ చేపలు వేయాలన్నారు. మంచినీటి పైపులు లీకేజీ కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ఏఎస్పీ గీతే మహేష్

ఏటూరునాగారం రూరల్, జూలై 1 : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ దీన్ని పాటించాలని ఏటూరునాగారం ఏఎస్పీ గీతే మహేష్ బాబాసాహెబ్ అన్నారు. యోగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ గిరిజన బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో ఏఎస్పీ యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ యోగాతో సమగ్ర వ్యక్తిత్వ వికాసాలతో పాటు చురుకుదనం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ అనుమల శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మావోయిస్టు నేతల తలలపై రివార్డులు

ఏటూరునాగారం, జూలై 1 : మావోయిస్టు ముఖ్య నేతల తలలపై పోలీసులు రివార్డులు ప్రకటించారు. ఏజెన్సీ గ్రామీణ ప్రాంతంలో ప్రజలు మావోయిస్టులకు సహకరించొద్దంటూ సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో పోస్టర్లు, కరపత్రాలను సోమవారం మండల కేంద్రంలో అతికించారు. మావోయిస్టు నేతలు కుర్సం మంగు అలియాస్ భద్రు, పాపన్న, లక్ష్మణ్, కోవాసి గంగ అలియాస్ మహేష్, కరుణాకర్, అశోక్, మధు, గణేష్ అలియాస్ మంగు తదితర మావోయిస్టుల ఫొటోలతో వాటిని ముద్రించారు. వారి తలలపై రూ. 1 లక్ష నుంచి రూ. 8 లక్షల వరకు రివార్డులు ప్రకటించారు. పోస్టర్లలో ఉన్న మావోయిస్టులపై సమాచారం ఇవ్వాలనుకొనే వారు ములుగు ఎస్పీ-8712670100, ములుగు డీఎస్పీ-8712670103, ఏటూరునాగారం ఏఎస్పీ-8712670104, ఏటూరునాగారం సీఐ-8712670113, ఏటూరు నాగారం ఎస్సై-8712670090 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

గట్టమ్మ దేవాలయ అభివృద్ధికి సహకరించాలి : ప్రధాన పూజారి

ములుగు కలెక్టరేట్, జూలై 1: ములుగు గట్టమ్మతల్లి దేవాలయ అభివృద్ధి పనులకు ఫారెస్టు అధికారులు సహకరించాలని ఆదివాసీ నాయకపోడ్ జిల్లా అధ్యక్షుడు, గట్టమ్మ ప్రధాన పూజారి కొత్త సురేందర్ కోరారు. సోమవారం దేవాదాయశాఖ ఈవో శ్రీనివాస్, ఫారెస్ట్ రేంజ్ అధికారి డోలి శంకర్‌లు గట్టమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారుల సంఘం ఆధ్వర్యంలో వారిని సత్కరించారు. ఈసందర్భంగా కొత్త సురేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గట్టమ్మ దేవాలయం చుట్టూ, పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటాలని, గట్టమ్మ వెనుకభాగంలో అటవీ సంరక్షణ వనాన్ని ఏర్పాటు చేయాలని, పండ్ల మొక్కలు నాటాలని, గట్టమ్మ వెనుక భాగంలో కెనాల్ కాల్వ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో గట్టమ్మ దేవాలయం ప్రాంతంలో నాటిన మొక్కలను నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పూజారులు కొత్త సదయ్య, ఆకుల మొగిలి, అరిగెల సమ్మయ్య, లక్ష్మయ్య, ఆకుల రాజు, రాజేందర్, పుల్లయ్య, చంద్రయ్య, రవి, కొత్త రవి, ఆకుల రఘు, రాజ్‌కుమార్, స్వామి, శివ, సంతోష్, రాజేందర్, ముత్తేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.